హైవేపై చిమ్మచీకట్లు

- జాతీయ రహదారిపై వెలగని వీధి దీపాలు
- ప్రమాదకరంగా రాకపోకలు
- పట్టించుకోని అధికారులు
- ప్రయాణికుల ఇబ్బందులు



విజయవాడ- మచిలీపట్నం జాతీయరహదారిపై కంకిపాడు పరిసరాల్లో వెలగని వీధి లైట్లు

కంకిపాడు: హైవేపై చిమ్మచీకట్లు అలముకుంటున్నాయి. వీధి దీపాల నిర్వహణను అధికారులు విస్మరించటంతో కారుచీకట్లు కమ్ముకుంటున్నాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం పొంచి ఉంది. హైవేపై ప్రయాణం ప్రమాదకరంగా మారిందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

విషయం ఇదీ

విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారి విస్తరణ పనులను దిలీప్ బిల్డ్‌కాన్‌సంస్థ నిర్వహించింది. ఈ క్రమంలో జాతీయ రహదారి మధ్యన డివైడరు నిర్మించి భారీ ఎత్తున వీధి దీపాలను ఏర్పాటు చేసింది. కంకిపాడు వద్ద బైపాస్ మార్గాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. బైపాస్ వెంబడి రోడ్డు మార్గానికి రెండు వైపులా వీధి దీపాలు ఏర్పాటు చేశారు.

వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తం

వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. కొద్ది నెలలుగా గంగూరు నుంచి గోసాల సెంటరు, కంకిపాడు బైపాస్ మార్గాల్లో వీధి దీపాలు మొరాయిస్తున్నాయి. కంకిపాడు బైపాస్‌పై సమస్య తీవ్రంగా ఉంది. రాత్రిళ్లు వీధి దీపాలు వెలగటం లేదు. దీంతో అర్ధరాత్రి సమయంలో విజయవాడ నుంచి ఉద్యోగాలు, పనులు ముగించుకుని ఇళ్లకు చేరుకునే ఉద్యోగులు, కార్మికులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగించాల్సి వస్తోంది. వాహనం దగ్గరకు వచ్చే వరకూ ఏ వాహనమో కూడా అర్థం కాని పరిస్థితి నెలకొంటుంది. వీధి దీపాల నిర్వహణలో అధికారుల అలసత్వం కారణంగానే సమస్య అపరిష్కృతంగా మారిందని వాహనదారులు వాపోతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

వీధి దీపాలు వెలగకపోవటంతో జాతీయ రహదారిపై ప్రయాణం నరకప్రాయంగా తయారైంది. హెవీ లోడు లారీల నుంచి జారిపడ్డ ఇసుక, మట్టి, వ్యర్థాలు రోడ్డుమార్జిన్‌లలో కుప్పలుగా పడి ఉంటున్నాయి. మార్జిన్ కనిపించక షడన్‌బ్రేక్ వేస్తే వాహనం పడినట్టే. ఇటీవల కాలంలో రోడ్డు మార్జిన్‌లలో ఉన్న ఇసుక కారణంగా పదుల సంఖ్యలో వాహనదారులు జారిపడి గాయపడ్డ ఘటనలు ఉన్నాయి. డివైడర్లలో పొంచి ఉన్న వీధి కుక్కలు ఒక్కసారిగా వాహనాలపై ఎగబడటంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. వీధి దీపాల నిర్వహణలో తలెత్తిన నిర్లక్ష్యం వల్లే ప్రమాదాలు పొంచి ఉంటున్నాయని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

అధికారులు స్పందించాలి

జాతీయ రహదారుల శాఖ అధికారులు వీధి దీపాల నిర్వహణపై దృష్టిపెట్టాలి. అస్తవ్యస్తంగా ఉన్న వీటి నిర్వహణతో తలెత్తుతున్న సమస్యలు, పొంచి ఉన్నప్రమాదాలను గుర్తించాలి. విద్యుత్ శాఖను సమన్వయం చేసుకుని వీధి దీపాలను సమర్థంగా నిర్వహిస్తే రాకపోకలు సజావుగా సాగుతాయన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది.

నేటి నుంచి మెడికల్ అండ్ హెల్త్ ఎగ్జిబిషన్

- 11వ తేదీ వరకు నిర్వహణ
- సందర్శకులకు ఉచిత ప్రవేశం



మాట్లాడుతున్న డైరెక్టర్ జనరల్ డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ సీవీ రావు తదితరులు

గన్నవరం రూరల్: ప్రజారోగ్య పరిరక్షణకు సిద్ధార్థ అకాడమీ పునరంకితం అవుతుందని డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, డైరెక్టర్ డాక్టర్ సీవీరావు అన్నారు. ఆదివారం కళాశాల కౌన్సిల్ హాల్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 4వ తేదీ నుంచి 11వ తేదీ వరకూ కళాశాల ప్రాంగణంలో మెడికల్ అండ్ హెల్త్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రారంభిస్తారు. అకాడమి ప్రతినిధులు పాల్గొంటారు. వారం రోజుల పాటు ప్రవేశం ఉచితమన్నారు. ప్రధానంగా సిద్ధార్థ అకాడమి 1975లో ప్రారంభమై గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు జరుపుకుంటోందని, ఆనాడు నాణ్యమైన విద్య అందరికి అందించాలన్న లక్ష్యంతో ఈ రోజుకు 18 విద్యా సంస్థలు నడుస్తున్నాయని చెప్పారు. ప్రజలకు ఖరీదైన విద్య, వైద్యం అతి తక్కువ ఖర్చుతో అందుబాటులోకి తేవటం అకాడమి లక్ష్యమన్నారు. చిన అవుటపల్లిలో మెడికల్ కళాశాల, బోధన ఆస్పత్రి, డెంటల్, నర్సింగ్, నర్సింగ్ స్కూల్, పారా మెడికల్ అందుబాటులోకి తెచ్చామన్నారు. సమావేశంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి భీమేశ్వర్, డాక్టర్ రాజగోపాల్ పాల్గొన్నారు.

డెంటల్ కాలేజీలో..

గన్నవరం రూరల్: మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాలలో సోమవారం నుంచి వారం రోజుల పాటు జరిగే ఆధునిక దంత వైద్యం అవగాహన ఎగ్జిబిషన్‌కు ఏర్పాట్లు పూర్తి చేశారు. 9 విభాగాల్లో సందర్శకులు తమ సందేహాలు తీర్చుకుని, నాణ్యమైన వైద్యం పొందేందుకు సూచనలు ఇస్తామని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామోజీరావు తెలిపారు. ఆదివారం ఎగ్జిబిషన్ ఏర్పాట్లు మెడికల్ కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు పరిశీలించారు. ఆధునిక దంత వైద్యాన్ని పేదలకు చేరువ చేయడానికి సిద్ధార్థ అకాడమి కృషి చేస్తుందన్నారు. రూ.75 లక్షల ఖర్చుతో ఏర్పాటు చేసిన క్యాడ్- క్యామ్ డిజిటల్ డెంటిస్ట్రీ యూనిట్‌ను సందర్శించారు. ఏడు నిమిషాల్లో పన్ను తయారీ, గంట వ్యవధిలో అమరిక జరుగుతుందన్నారు. హెచ్‌వోడీలు కాశేశ్వరరావు, అజయ్ బెనర్జీ, డాక్టర్ రాజ్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి జలమయం



జాతీయరహదారిపై భారీగా నిలిచిన వర్షపునీరు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి జాతీయ రహదారి జలమయమైంది. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు గ్రామాల్లో జాతీయ రహదారిపై భారీగా వర్షపునీరు చేరుకోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాయంత్రం ఒక్కసారిగా కురిసిన వర్షానికి హైవేపై ఇరు వైపులా ఉన్న డ్రెయిన్లు పొంగి రహదారిపైకి చేరుకున్నాయి. మురుగునీటికి వర్షపు నీరు తోడై రహదారిపై రెండు, మూడు అడుగుల మేర నిలిచిపోయింది. దీంతో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే జాతీయరహదారిపై ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రామవరప్పాడు నుంచి ఎనికేపాడు వరకూ ట్రాఫిక్ స్తంభించింది. ఆయా పంచాయతీ అధికారులు జాతీయరహదారికి ఇరు వైపులా ఉన్న డ్రెయిన్లు పూడిక తీయాలని, మురుగునీరు సజావుగా పోయే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

5 వేల మందికి అన్నదానం



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భువి నుంచి దివికేగిన చిన్ననాటి స్నేహితులను స్మరించుకుంటూ తేలప్రోలు రాజా హైస్కూల్(1989–94)బ్యాచ్ ఆదివారం అన్నదానం నిర్వహించింది. కేటీరోడ్డులోని శ్రీ తేలప్రోలు రాజా హైస్కూల్ ఎదుట ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 5 వందల మందికి అన్నదానం చేశారు. తొలుత తాము కోల్పోయిన సీతారాం, సాంబ, రెహమాన్, చిరంజీవి, తిరుమలరావు, సతీష్, వరప్రసాద్, సుధాకర్, రాంబాబు, ప్రసాద్‌ల చిత్రపటాలకు కుటుంబ సభ్యులతో కలిసి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకుని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి దేశ విదేశాలతో పాటు కర్ణాటక, హైదరాబాద్‌లో స్థిరపడిన వారు కూడా హాజరు కావడం విశేషం. అనంతరం తాము విద్యాబుద్ధులు నేర్చుకున్న స్కూల్ ఆవరణలో కాసేపు స్నేహితులందరూ ముచ్చటించుకుని ఫొటోలు, సెల్ఫీలు దిగారు. కార్యక్రమంలో వాసి శ్రీనివాస్, ఎల్.శివశంకర్, రాధాకృష్ణ, టి.శంకర్, ఈ.కొండ, మంగప్రసాద్, బి.రమేష్, వడిపిన సుధాకర్, సీహెచ్.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హనుమాన్‌జంక్షన్ రూరల్: కొత్తగా నిర్మిస్తున్న విద్యుత్ ఇన్‌లైన్ టవర్ల నిర్మాణ పనుల నిమిత్తం కానుమోలు, రంగన్నగూడెం 132 కేవీ విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీ ట్రాన్స్‌కో నున్న ఈఈ ఎస్.కోటేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుణదల- కానుమోలు, గుణదల- రంగన్నగూడెం విద్యుత్ లైన్లలో ఎల్‌వోసీ నంబర్: 205 వద్ద కొత్తగా ఇన్‌లైన్ టవర్ నిర్మాణం గత ఐదు రోజులుగా జరుగుతుందని చెప్పారు. తుది దశ పనుల నిమిత్తం, అత్యవసర పరిస్థితులకు అనుగుణంగా కానుమోలు, రంగన్నగూడెం 132 కేవీ విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని చెప్పారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

హనుమాన్‌జంక్షన్ రూరల్: గుట్టుచప్పుడు కాకుండా జూదశిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హనుమాన్‌జంక్షన్ ఎస్ఐ వి.సురేష్ హెచ్చరించారు. స్థానిక తారకరామ కాలనీ సమీపంలోని పామాయిల్ తోటల్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఆదివారం హనుమాన్‌జంక్షన్ పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు జూదరులను, రూ.6400 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. పేకాట, కోడిపందేలు వంటి జూదాల నిర్వహణ చట్టరీత్యా నేరమని, వీటి నిర్వాహకులపై ప్రత్యేక నిఘా పెట్టామని చెప్పారు.

నేడు 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ'

కంకిపాడు: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమం ఈనెల 4వ తేదీ సాయంత్రం 4 గంటలకు కంకిపాడులోని రాయల్ ఫంక్షన్ హాలులో నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షురాలు మాదు శ్రీహరిరాణి తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. కూటమి సర్కారు మోసపూరిత విధానాలను సమావేశంలో వివరించటం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి హాజరై ప్రసంగిస్తారన్నారు. మండలంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులు, నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

రేషన్ షాపుల తనిఖీ

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో రేషన్ షాపులను సివిల్ సప్లయిస్ అధికారులు ఆదివారం తనిఖీ చేశారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శరత్ ప్రతి రేషన్ షాపులో ఉన్న స్టాకును పరిశీలించి, లబ్ధిదారులకు అందజేస్తున్న నిత్యావసర సరుకుల పంపిణీని కార్డుల ద్వారా తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రేషన్ షాపులను తెరచి ఉంచాలని ఆర్ఐ శరత్ డీలర్లకు తెలియజేశారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు.

ఆపన్నులకు అండగా వైఎస్సార్ సీపీ



కంకిపాడు: ఆపన్నులకు అండగా వైఎస్సార్ సీపీ నిలుస్తుందని జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షురాలు మాదు శ్రీహరిరాణి అన్నారు. గొడవర్రు గ్రామానికి చెందిన ఎలక్ట్రీషియన్ బొడ్డు విజయశేఖర్ విద్యుదాఘాతానికి గురై కంకిపాడు సామాజిక ఆరోగ్యకేంద్రంలో చికిత్స పొందుతుండటంతో వైఎస్సార్ సీపీ నేతలు ఆదివారం పరామర్శించారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి అందజేసిన రూ. 10 వేల ఆర్థిక సాయాన్ని బాధితుడికి అందజేశారు. బాకీ బాబు, మాదు శ్రీహరిరాణి మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందన్నారు. గొడవర్రు సర్పంచ్ మేరుగు విజయ చంద్రశేఖర్, నాయకులు కాగిత రాజా రమేష్, చుండూరు మోహన్‌రావు, మావులూరి కృష్ణ, మాదు రామారావు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సేవలు అభినందనీయం



శిలాఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ విజయసారథి, బాబు, పూర్వ విద్యార్థులు



హాజరైన పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): చదువుకున్న కళాశాలకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్న పూర్వ విద్యార్థుల సేవలు అభినందనీయమని విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయసారథి చెప్పారు. స్థానిక రమేష్ ఆస్పత్రి రోడ్డులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థుల 7వ ఆత్మీయ సమావేశం కళాశాల ఆవరణలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా విజయసారథి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు కలిసి రూ.27 లక్షలతో కళాశాల ఆవరణలోని మూడు వర్క్‌షాప్‌లకు సిమెంట్ రేకులను తొలగించి కొత్తగా రేకులను అమర్చడంతో పాటుగా ల్యాబ్‌లో విద్యార్థులకు అవసరమైన యంత్రాలను అందచేయడం అభినందనీయమన్నారు. కళాశాల అభివృద్ధి నిమిత్తం పూర్వ విద్యార్థులు నీలకంఠేశ్వరరావు రూ.25 వేలు, ఎస్.పాపారావు రూ.10 వేలు, సాగి కాంతారావు రూ.10 వేలు, వై.రేవేంద్రప్రసాద్ రూ.5 వేలను ఆదివారం అందజేశారని చెప్పారు. చదువుకున్న కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులందరూ కలిసి చేస్తున్న సహాయం వెలకట్టలేనిదన్నారు. పూర్వ విద్యార్థుల సహకారంతో నిర్మాణం చేసిన వర్క్‌షాప్ పనుల వివరాలతో ఏర్పాటు చేసిన శిలాఫలాకాన్ని రిటైర్డ్ అధ్యాపకుడు భానుమూర్తి, ప్రిన్సిపాల్ ఎం.విజయసారథి కలిసి ఆవిష్కరించారు.

ఉత్సాహంగా గడిపిన పూర్వ విద్యార్థులు

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆత్మీయ సమావేశానికి 1962వ సంవత్సరంలో కలిసి చదువుతున్న విద్యార్థులు సైతం ఈ సమావేశానికి హాజరయ్యారు. కళాశాలలో చదువుకున్న అన్ని బ్యాచ్‌ల విద్యార్థులు వచ్చి వారు చదువుకున్న తరగతి గదులు, వర్క్‌షాప్‌ల్లోకి వెళ్లి ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆనాటి స్నేహితులతో స్నేహితుల దినోత్సవం రోజు కలవడంతో సంతోషంగా గడిపారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఎంవీ.బాబు, సభ్యులు ఎస్.గోపిచంద్, శ్రీనివాసరెడ్డి, భానుమూర్తి, కట్లయ్య, దేవరకొండ వెంకటేశ్వర్లు, మధు, కోనేరు బోస్, శేషయ్య, సుబ్బారావు, రామకృష్ణ పరమహంస, నీలకంఠేశ్వరరావు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

బాబు మోసాలను ప్రజలకు వివరిద్దాం

- కార్యకర్తలకు దిశానిర్దేశం చేసిన పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త చక్రవర్తి
- ఉయ్యూరులో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ



మాట్లాడుతున్న పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి



సభకు హాజరైన పార్టీ శ్రేణులు

ఉయ్యూరు: మోసం చేయటం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి అన్నారు. ఉయ్యూరు పట్టణంలోని ఆర్య వైశ్య కల్యాణ మండపంలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ, ఉయ్యూరు పట్టణ, మండల పార్టీ విస్తృత సమావేశం ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా చక్రవర్తి మాట్లాడుతూ మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నైజాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయటంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అర్హులకు సంక్షేమ పథకాల్లో కోత విధించి పేదల పొట్ట గొడుతున్నారని ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేక అక్రమ కేసులు, మోసపూరిత వ్యవహారాలతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్న ఘనుడు చంద్రబాబు అని ఆరోపించారు. కూటమి అధికారంలోకి వచ్చిన 18 నెలల పాలనలో రూ.1.80 లక్షల కోట్లు అప్పులు చేసి ప్రజల నెత్తిన భారాలు మోపారని విమర్శించారు. ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా మారటానికి చంద్రబాబే కారణమన్నారు. వైద్యం అందక ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని, విద్య, వ్యవసాయాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఎరువులు దొరక్క ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం చోద్యం చూస్తోందని విమర్శించారు. పెనమలూరు నియోజకవర్గంలో కూటమి లోని ముఖ్య నేతలు అవినీతికి కేరాఫ్‌గా మారారని విమర్శించారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు. కష్టించి పనిచేసే నాయకులు, కార్యకర్తలకు సముచిత స్థానం ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి చైతన్య పర్చాలన్నారు. జగనన్నతోనే రాష్ట్ర ఉజ్వల భవిత ముడిపడి ఉందని, జగనన్నకు బాసటగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, మున్సిపల్ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జంపాన కొండలరావు, పార్టీ పట్టణ, ఉయ్యూరు మండల అధ్యక్షులు షేక్ అబుకలాం, దాసే రవి, మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, కంకిపాడు మండల పార్టీ అధ్యక్షురాలు మాదు శ్రీహరిరాణి, నాయకులు పి.రాఘవరావు, వల్లభనేని వెంకటేశ్వరరావు, గడ్డం చైతన్య, గోన మదన్, రాజులపాటి చిన్ని, షేక్ అబు కలాం, ఎం.బ్రహ్మంనాయక్, గుండె పోతురాజు, బందెల శ్రీనివాసరావు, అబ్దుల్ సద్దాం, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మొక్కలు నాటడం అలవాటుగా మార్చుకోవాలి



పంపిణీకి సిద్ధంగా ఉంచిన మొక్కల వద్ద డాక్టర్ వేణుగోపాలరెడ్డి, సిబ్బంది

లబ్బీపేట(విజయవాడతూర్పు): మొక్కలు నాటడం ప్రతి ఒక్కరూ అలవాటుగా మార్చుకోవాలని, అడవుల పరిరక్షణ, విస్తరణ జీవన వైవిధ్యాన్ని పెంపొందించేందుకు ఎంతగానో ఉపయోగపడతాయని డయాబెటిస్ స్పెషలిస్ట్ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి అన్నారు. ప్రతి ఏటా వర్షాకాలంలో నిర్వహించే మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. అందులో భాగంగా రెండేళ్ల వయసున్న 600 మామిడి మొక్కలను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా మొగల్రాజపురంలోని తమ ఆస్పత్రి వద్ద ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. తాను 15 ఏళ్లుగా పలు గ్రామీణ ప్రాంతాల్లో మొక్కలను నాటడంతో పాటు వాటి సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తన దగ్గరకు వచ్చే పేషెంట్లకు కూడా మొక్కలను అందజేస్తున్నానన్నారు. స్వచ్ఛమైన ఆహ్లాదకరమైన వాతావరణ కోసం నాటిన ప్రతి మొక్కను కాపాడుకోవాల్సిన బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. భూ మండలంపై కాలుష్యం తగ్గించేందుకు, నీటి నాణ్యతను మెరుగుపరచడం, నేల కోతను నివారించడం, వన్యప్రాణాలకు ఆవాసం కల్పించడం, మానసిక ప్రశాంతతను అందించడం వంటివి మొక్కలు నాటడం వల్ల కలుగుతుందన్నారు. ఇప్పటి వరకూ 50 వేల మొక్కలు పంపిణీ చేశామని, తాజాగా ఈ ఏడాది 600 మామిడి మొక్కలు పంపిణీకి సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన



కంకిపాడు: మండలంలోని కాసరనేనివారిపాలెం గ్రామంలో రూ.15 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆదివారం భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాసరనేనివారిపాలెం ప్రత్యేక రెవెన్యూ విలేజ్‌గా ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉందని, ఉన్నతాధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.వరప్రసాద్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు గొంది శివరామకృష్ణప్రసాద్, ఎంపీడీఓ అనూష, నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, చిట్టూరి నాగేశ్వరరావు, ఏనుగ జయ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంకమ్మ తల్లికి పూజలు



పెనమలూరు: శ్రావణమాసం సందర్భంగా పెనమలూరు గ్రామంలో ఆదివారం నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆకునూరి వారి అంకమ్మ తల్లి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి పొంగళ్లు, నైవేద్యం సమర్పించారు. తెలుగు నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఆకునూరి సుబ్బారావు మాట్లాడుతూ పజలంతా సుఖసంతోషాలతో, రైతులు పాడిపంటలతో సంమృద్ధిగా ఉండాలని శ్రావణమాసంలో అమ్మ వారికి ప్రతి ఏటా పూజలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆకునూరు బసవరాజు, ఆకునూరు శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, రమేష్, వి.మారుతి, తెన్నేటి ప్రకాష్, మద్దిరాల వెంకట సుబ్బారావు, పరస బాలకృష్ణ భక్తులు పాల్గొన్నారు.

ఎస్ఐ కిషోర్ బాధ్యతల స్వీకరణ



గన్నవరం: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అదనపు ఎస్ఐగా 2014 బ్యాచ్‌కు చెందిన పరిమి కిషోర్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో వీరులపాడు, నందిగామ, ఆగిరిపల్లి, విసన్నపేట పీఎస్ ఎస్ఐగా పనిచేశారు. ప్రస్తుతం విజయవాడ సెంట్రల్ క్రైమ్ విభాగంలో పనిచేస్తున్న కిషోర్‌ను బదిలీపై గన్నవరం పీఎస్‌కు వచ్చారు. ఈ మేరకు బాధ్యతలు చేపట్టిన ఆయన స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ సీఐ బీవీ. శివప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రస్తుతం ఇక్కడ ఎం.ప్రేమ్‌కుమార్, శ్రీధర్ ఎస్ఐలుగా కొనసాగుతుండగా కిషోర్ రాకతో మూడవ ఎస్ఐ పోస్టు కూడా భర్తీ అయ్యింది.

ఏటిపాయలో తగ్గుముఖం పట్టిన వరద



కంకిపాడు: ఏటిపాయలో వరద తగ్గుముఖం పట్టింది. ఏటిపాయలో నీటి ప్రవాహం కొనసాగుతున్నప్పటికీ ఉధృతి తగ్గింది. మండలంలోని మద్దూరు, కాసరనేనివారిపాలెం పరిధిలో వెళ్తున్న కృష్ణానది ఏటిపాయ ఆదివారం నాటికి పది అడుగుల మేర వెనక్కివెళ్లింది. అయితే నేటికీ మద్దూరు వద్ద ఏటిపాయ నుంచి లంక భూముల్లోకి వెళ్లే మార్గం బయటపడలేదు. ఆ ప్రాంతం వరకూ నిండుగా నీరు ప్రవహిస్తోంది. దీంతో పంట పొలాల్లో కూలీ పనులకు వెళ్లే కూలీలు పడవలను ఆశ్రయించి పనులకు వెళ్లి వస్తున్నారు.

కొనసాగుతున్న గ్రామోత్సవం



గన్నవరం: శ్రీలక్ష్మీతిరుపతమ్మ సమేత గోపయ్య ఉత్సవమూర్తుల గ్రామోత్సవం ఘనంగా జరుగుతోంది. ఈ నెల 1న స్థానిక పాతగన్నవరంలోని దేవస్థానంలో జరిగిన శ్రావణమాస సంబరాల అనంతరం అమ్మవారు గ్రామోత్సవానికి బయలుదేరారు. గత మూడు రోజులుగా గ్రామంలోని అన్ని వీధుల్లో ఊరేగింపుగా వెళుతూ అమ్మవారు భక్తులచే హారతులు అందుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం స్థానిక బుద్ధవరం రోడ్డు, గౌడపేట, యాదవులపేట, చెంచుల కాలనీ, సగరపేట, గాజుల బజార్, రజకులపేటలో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. తమ ఇళ్ల ముందుకు వచ్చిన అమ్మవారిని భక్తులు దర్శించుకుని నీరాజనాలు పలుకుతున్నారు. సోమవారం ఉదయం ఆలయ ప్రవేశం చేస్తారని దేవస్థాన కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ తెలిపారు.

చవితి ఉత్సవాలకు భూమి పూజ

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధి కానూరు సిరినగర్‌లో ఆదివారం వినాయకచవితి ఉత్సవాలకు భూమి పూజ చేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గాల పరిశీలకుడు అన్నే వేణుగోపాలకృష్ణమూర్తి (చిట్టిబాబు), పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. తాడిగడప మున్సిపాలిటీ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వేమూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో ప్రతిఏడాది ఎంతో ప్రతిష్టాత్మకంగా వినాయకచవితి వేడుకలు జరుపుతున్నారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ ఈ ఏడాది కూడా వినాయకచవతి ఉత్సవాలు భక్తుల సహకారంతో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. దీనికి అందరి సహకారం కావాలని కోరారు.